


శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా
అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.
ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠకు ప్రతీక అయిన
శ్రీరాముడు మనకు ఆదర్శం. ఆయన
ఆశీస్సులతో ప్రతి ఇంట ఆనందం,
ఐశ్వర్యం నిండాలని, సుఖశాంతులు
నెలకొనాలని మనస్ఫూర్తిగా
కోరుకుంటున్నాను.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 27.03.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 339 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అమరావతికి 'చట్ట' కవచం!



- పునర్విభజన చట్టం సవరణకు కేబినెట్ తీర్మానం..
- ఎల్లుండి అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ..
- అమరావతి అజేయం.. చట్ట సవరణే లక్ష్యం
- రాష్ట్ర ఆదాయంలో 99% జీతాలకే..
- క్లిష్ట పరిస్థితుల్లోనూ సంక్షేమ పథం

2 లో



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర రాజధానిగా అమరావతికి తిరుగులేని చట్టబద్ధత కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం పలు చారిత్రాత్మక నిర్ణయాలకు వేదికైంది. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ భేటీలో అమరావతి భవితవ్యం, విద్యుత్ సంస్కరణలు, సామాజిక భద్రతతో పాటు పాలనాపరమైన అంశాలపై కేబినెట్ ముద్ర వేసింది.

**పునర్విభజన చట్టంలో మార్పులు!** : ఏపీ పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్-5ను సవరించాలని కోరుతూ మంత్రివర్గం తీర్మానం చేసింది. సీఆర్డీఏ పరిధిలోని అమరావతిని అధికారిక రాజధానిగా చట్టంలో చేర్చాలని కేంద్రాన్ని కోరనుంది. ఈ అంశంపై మార్చి 28న అసెంబ్లీలో నాలుగు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరపాలని నిర్ణయించారు. "రాజధాని చరిత్రను, అమరావతి కోసం రైతులు చేసిన త్యాగాలను ప్రజలకు వివరించాలి. గత ప్రభుత్వం ఆడిన 'మూడు రాజధానుల' నాటకాన్ని, నాటి మండలి చైర్మన్‌పై జరిగిన దాడులను అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలి" అని మంత్రులకు సీఎం దిశానిర్దేశం
అమరావతికి 'చట్ట' కవచం!
చేశారు.

## మార్కాపురం వద్ద మృత్యు ఘోష



- బస్సు-టిప్పర్ ఢీ, కాలిబూడిదైన ప్రయాణికులు
- హైదరాబాద్ నుంచి పామురు వెళ్తుండగా విషాదం
- 14 మంది సజీవ దహనం!
- నాడు జరిమానా.. నేడు ప్రాణాలకే ఎసరు: నిర్లక్ష్యానికి పరాకాష్ట!
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- కావేరీ ఘటన మరవకముందే మరో విలయం

**మార్కాపురం(జర్నలిస్ట్ ఫైల్)** : వరుస రోడ్డు ప్రమాదాలు తెలుగు రాష్ట్రాలను భయపెడుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ఏపీలోని మార్కాపురం జిల్లాలో హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన బస్సు, టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో 14 మంది సజీవ దహనం కాగా మరో 28 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషయమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తున్న హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, రాయవరం క్వారీల వద్ద వేగంగా వస్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో టిప్పర్ డీజిల్ ట్యాంక్ పగిలిపోవడంతో క్షణాల్లోనే మంటలు రెండు వాహనాలకు వ్యాపించాయి. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో, ప్రయాణికులు తమ సీట్ల నుండి లేచి బయటకు వచ్చే లోపే బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతైపోయింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో ఉలిక్కిపడ్డారు. కొందరు కిటికీలు పగులగొట్టుకుని ప్రాణాలతో బయటపడగా, 2లో...

## ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ అత్యవసర భేటీ!

- నేడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మోడీ కీలక భేటీ
- చమురు, గ్యాస్ నిల్వలపై సమీక్ష; పుకార్ల నివారణకు ఆదేశం
- దేశంలో 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు: కేంద్రం స్పష్టత



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)** : పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధ మేఘాలు ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఉద్రిక్తతల ప్రభావం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలపై పడటంతో పాటు భారత్‌లో ఇంధన సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగారు. పశ్చిమాసియా పరిణామాలపై చర్చించేందుకు రేపు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆయన అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు.

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష** : వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న ఈ భేటీలో ప్రధానంగా చమురు నిల్వలు, ధరల నియంత్రణపై చర్చించనున్నారు. అంతర్జాతీయంగా తలెత్తిన సంక్షోభం కారణంగా గల్ఫ్ దేశాల నుంచి రవాణాకు ఆటంకాలు ఏర్పడితే అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ వ్యూహాలను ప్రధాని రాష్ట్రాలకు వివరించనున్నారు. ముఖ్యంగా దేశీయంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేయనున్నారు. మిగతా 2లో...

## రాష్ట్రంలో 96 కోర్టుల ఏర్పాటు



- వాటి నిర్వహణ కోసం 1730 పోస్టులకు గ్రీన్ సిగ్నల్
- సత్వర న్యాయం, పెండింగ్ కేసుల తగ్గింపు కోసం కృషి
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రవ్యాప్తంగా 2026-27 లో 96 క్రొత్త మరియు అదనపు కోర్టుల ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం న్యాయశాఖకు సంబంధించిన అంశాలకు సంబంధించి ఆమోదం లభించిన వివరాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. పెండింగ్ కేసుల తగ్గింపు కోసం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కొత్త కోర్టుల ఏర్పాటు కోసం హైకోర్టు రిజిస్ట్రార్( పరిపాలన విభాగం ) ప్రతిపాదించడం జరిగిందని, ఈ ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని పేర్కొన్నారు. మిగతా 2లో...

## విద్యార్థుల భవితకు 'అంబేద్కర్' భరోసా!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాలు గురువారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి విడుదల చేశారు. 2026 - 27 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ఖాళీగా ఉన్న 15,020 సీట్లు, జూనియర్ ఇంటర్ లో 13,840 సీట్లకు 01.03.2026 ప్రవేశ పరీక్ష నిర్వహించారు. వీటితో పాటు 6,7,8,9,10 తరగతుల్లో ఖాళీలకు 08.03.2026 వ తేదీన పరీక్ష నిర్వహించారు. మిగతా 2లో...

## పారిశ్రామికవేత్తలుగా వడ్డెర్లు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- వడ్డెర సామాజిక వర్గీయులకు ఆర్థిక, సామాజిక భరోసే మా లక్ష్యం
- వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం కేటాయింపులు
- సీనరేజీలో 50 శాతం మినహాయింపు బిల్లుకు కేబినెట్ లో ఆమోదం
- ఈ బిల్లుతో వడ్డెర్లకు ఆర్థిక మేలు అంటూ మంత్రి సవిత హర్షం
- సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : వడ్డెర్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారిని ఆర్థికంగా మేలు చేయడమే సీఎం చంద్రబాబు సంకల్పమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. దీనిలో భాగంగానే వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయింపుల్లో 15 శాతం మేర రిజర్వేషన్లు కల్పిస్తున్నా మన్నారు. సీనరేజీలో 50 శాతం మినహాయింపు ఇవ్వడానికి కూడా కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో గురువారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రిమండలి బిల్లు కూడా ఆమోదించిందని తెలిపారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చడంపై హర్షం వ్యక్తంచేశారు. మాటల నిలబెట్టుకున్నందకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్‌కు 2లో...

## ఇంధనానికి 'ధోకా' లేదు..




- 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు: కేంద్రం
- సోషల్ మీడియా పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దు

2 లో

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)** : పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కొరత ఏర్పడనుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం గట్టి వివరణ ఇచ్చింది. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అనవసరంగా బంకుల వద్ద క్యూలు కట్టి 'అత్యవసర కొనుగోళ్లకు' పాల్పడవద్దని విజ్ఞప్తి చేసింది.

## ఏపీకి వడగాడ్పుల ముప్పు!



- రెండు రోజుల పాటు రాష్ట్రంలో వడగాడ్పుల తీవ్రత
- రేపు 90 మండలాల్లో భానుడి ప్రతాపం
- అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- పలు జిల్లాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో భానుడు సెగలు గక్కుతున్నాడు. మార్చి నెలలోనే ఎండలు దంచి కొడుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీల మార్కును దాటేశాయి. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దేశ వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. పలు రాష్ట్రాలలో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మిగతా 2లో...

## వీఏవోలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ



- రాష్ట్రంలో 27,500 గ్రామ సంఘ సహాయకులకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ
- పేదల ఇళ్లల్లో 20 ఏళ్ల క్రితమే చంద్రబాబు వెలుగులు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : గ్రామీణ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తోన్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ సంఘ సహాయకులకులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయాలన్న నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తెలిపారు. రెండున్నర దశాబ్దాల క్రిందటే నాడు ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు వెలుగు పథకం ద్వారా పేదల ఇళ్లల్లో వెలుగులు నింపేందుకు 2లో...

## నంద్యాలలో జాబ్ మేళా ను ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్



(జర్నలిస్ట్ ఫైల్) నంద్యాల మార్చి 26 : నంద్యాల ఎన్టీఆర్ షాది ఖానా లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.. గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని ఫయాజ్ తెలిపారుఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు . 13 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయని దాదాపు 900 కి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు . నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు . ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రివర్యులు నారా లోకేష్ గారు సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు .ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కళ్యాణి, ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మస్తాన్ వలి, 6 వ వార్డు టిడిపి ఇంచార్జి పల్లె వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



## కోనప్పలపాడు గ్రామంలో బాలుడు మిస్సింగ్



యాడికి మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : మండలంలోని కోనప్పలపాడు గ్రామంలో బాలుడు మిస్సింగ్ కలకలం రేపింది. ఉదయం సంతోషంగా బడికి వెళ్లిన చిన్నారి మధ్యాహ్నం బడి బస్సు దిగిన వెంటనే గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేశాడనే విషయం గ్రామంలో దావానలంలా వ్యాపించింది. ఉప్పలపాడు గ్రామానికి చెందిన బోయ గోవింద్ కుమారుడు హేమచంద్ర (5 సం") బుధవారం ఉదయం యాడికి మండలంలోని వాగ్దేవి హై స్కూల్ కు వెళ్లి మధ్యాహ్నం బడి బస్సులో ఉప్పలపాడు గ్రామానికి రావడం జరిగిందని తోటి విద్యార్థులు తెలిపారు. ఇంటికి వెళ్లే మార్గంలో ఎవరో అగంతకుడు బైక్ లో వచ్చి బాలుడిని అపహరించాడని స్థానికులు చర్చించుకున్నారు. యాడికి సీఐ శ్రీనివాసులు గ్రామానికి వచ్చి స్థానికులను విచారించి వివరాలు సేకరించారు. బాలుడు మిస్సింగ్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మున్సిపాలిటీ ఏడవ వార్డు ఇందిరమ్మ లేఅవుట్ పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చినారు కానీ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం



(జర్నలిస్ట్ ఫైల్) : చిత్తూరు జిల్లా నగిరి : ఎమ్మెల్యే గారు ఎంపీ గారు మున్సిపాలిటీ డబ్బులు లేకుంటే స్పెషల్ గ్రాండ్ రిలీజ్ చేసి మౌలిక సౌకర్యాలు కల్పించండి... సిపిఐ పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ నగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేశమ్మ గుడి దగ్గర ఉన్న ఇందిరమ్మ లే అవుట్ 7 వార్డుని పరిశీలించిన సిపిఐ పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ గారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కాలనీ ఏర్పాటు చేస్తే అక్కడ పేదలకు ఇస్తున్న ఇంటి స్థలాలకు సంబంధించి గాని వారికి రోడ్లు డ్రైనేజీ కాలువలు వీధిలైట్లు తాగునీటి సౌకర్యాలు కల్పించి ఆ గ్రామ జనాభా ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు ఇంటి స్థలాలు పంచడంతోపాటు ఆ కాలనీ కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. కానీ దురదృష్టం ఏమంటే లేఔట్ ఏర్పాటుచేసి ఇంటి స్థలాలు ఇచ్చి మౌలిక వసతులైన రోడ్లు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నగిరి ఎమ్మెల్యే స్పందించి మున్సిపాలిటీలో డబ్బులు లేకపోయినా స్పెషల్ గ్రాండ్ రిలీజ్ చేసి సిమెంట్ రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికి 15 సంవత్సరాలు వస్తున్న కనీసం వీధిలో రోడ్లు కూడా వేయకుండా డ్రైనేజీ లేకుండా ఉండటం ఆశ్చర్యకరంగా ఉంది. కావున ఇప్పటికైనా కలెక్టర్ గారు స్పందించి అదేవిధంగా ఎమ్మెల్యే గారు ఎంపీ గారు చొరవ తీసుకొని మున్సిపాలిటీలో డబ్బు లేకపోయినా మీరు స్పెషల్ గ్రాండ్ రిలీజ్ చేసి యుద్ధ ప్రాతిపదికన చర్యలు రోడ్లు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు మున్సిపల్ అధికారులు కూడా చొరవ తీసుకొని వారికి హౌస్ టాక్స్ ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు పనిచేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి శివారెడ్డి 7 కమిటీ సభ్యులు హేమలత నిర్మల భారతి గజలక్ష్మి అమ్ములు సెల్వం పాల్గొన్న వార్డు సభ్యులు

## శ్రీరంగపట్నం మేజర్ పంచాయతీ సర్పంచి బరిలో 'సూరిశెట్టి మహేష్'



కోరుకొండ, మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం రాజకీయాలు వేడెక్కాయి. గ్రామాభివృద్ధే ధ్యేయంగా సీనియర్ నాయకుడు సూరిశెట్టి మహేష్ సర్పంచి అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. బుధవారం తన మద్దతుదారులతో కలిసి ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు.మార్పు కోసమే ఈ అడుగు..గ్రామంలో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాల మెరుగుదల మరియు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే తన లక్ష్యమని మహేష్ పేర్కొన్నారు. మహేష్ బరిలోకి దిగడంతో గ్రామంలోని యువత, మహిళలు మరియు పెద్దల నుంచి విశేష స్పందన లభిస్తోంది.గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం.స్థానిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు.పారదర్శక పాలన: అవినీతి రహిత పంచాయతీగా తీర్చిదిద్దడం, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం తన లక్ష్యం అని మహేష్ వెల్లడించారు. అదేవిధంగా కూటమి నాయకులు పెద్దలు ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు.

## వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు



దమ్మపేట మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : దమ్మపేట మండల కేంద్రంలో గల బాలాజీ సెంటర్ నందు శ్రీరామనవమి సందర్భంగా బాలాజీ సెంటర్ వర్తకసంఘం ఆధ్వర్యంలో శ్రీ రాముల వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు బాధ్యులు తెలిపారు ఈ సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి రాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని విక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు

# ఆంధ్ర ప్రదేశ్‌లో 1.14 లక్షల ఇళ్లపై సౌర పలకలు ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్రం సమాధానం




విజయవాడ, మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' (పీఎంఎస్‌జీ : ఎంబీవై ) పథకం ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశిస్తోంది. పథకం వేగంగా అమలు జరుగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ లోక్ సభలో వెల్లడించారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం పురోగతిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో పాటుగా పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' (పీఎంఎస్‌జీ : ఎంబీవై ) పథకం ద్వారా దేశవ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 66.48 లక్షల దరఖాస్తులు రాగా, 26.20 లక్షల ఇన్‌స్టాలేషన్లు పూర్తయ్యాయని దీనివల్ల మొత్తం 32,40,068 కుటుంబాలు ప్రయోజనం పొందాయని తెలిపారు. ఈ పథకం అమలుకు కేంద్రం ఇప్పటివరకు రూ. 17,967.46 కోట్ల సబ్సిడీని విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు . అదే విధంగా ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పటివరకు 1,14,313 గృహాలపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు మంత్రి శ్రీపాద్ యశో నాయక్ తెలిపారు.2024 ఫిబ్రవరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం ప్రారంభమైందని, పథకం ప్రారంభం నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు . ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 32,40,068 దరఖాస్తులు రాగా రాష్ట్రంలో మొత్తం 14,72,814 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వీటిలో 1,14,313 దరఖాస్తులకు సంబంధించి ఇన్‌స్టాలేషన్లు ఇప్పటికే పూర్తయినట్లు మంత్రి తెలిపారు. తద్వారా 1,17,453 కుటుంబాలకు రాష్ట్రంలో లబ్ధి చేకూరిందనీ, ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 734.97 కోట్లను ఆర్థిక సహాయం (సబ్సిడీ) రూపంలో ఈ ఏడాది మార్చి 20 నాటికి నేరుగా పంపిణీ చేసిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం అమలు పురోగతిని జిల్లాల వారీగా పరిశీలిస్తే.పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా 1,62,506 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సోలార్ పలకల ఏర్పాటులో గుంటూరు జిల్లా 7,767 యూనిట్లతో అగ్రస్థానంలో ఉందన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఏలూరు (7,341), కాకినాడ (6,878), కృష్ణా (6,871), విశాఖపట్నం (6,208) జిల్లాలు ఉన్నాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అతి తక్కువగా 62 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,508 మంది రిజిస్టర్డ్ వెండర్లు సోలార్ పలకల ఏర్పాటు సేవలు అందిస్తున్నారని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 'మోడల్ సోలార్ గ్రామాల'ను ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. అనకాపల్లి జిల్లా బయ్యవరం, కాకినాడ జిల్లా తిమ్మాపురం, శ్రీకాకుళం జిల్లాలో అంపోలు, తూర్పు గోదావరి జిల్లాలో మలకపల్లి, కోనసీమ జిల్లాలో వానపల్లి, విజయనగరంలో బొద్దం, పశ్చిమ గోదావరి జిల్లాలో ఆలంపూర్, విశాఖపట్నంలో ఆర్. తాళ్లవలస, పార్వతీపురం మన్యంలో నరిపురం, ఏలూరుజిల్లాలో తాడికలపూడి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, కర్నూలు జిల్లాలో పెద్దహరివాణం గ్రామాలను మోడల్ సోలార్ గ్రామలుగా ప్రకటించడం జరిగిందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి విషయానికొస్తే.ఒక కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ ద్వారా రోజుకు సగటున నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని మంత్రి వివరించారు . రాష్ట్రంలో మెజారిటీ గృహాల్లో నెట్-మీటరింగ్ విధానం అమలులో ఉందని, కొన్ని చోట్ల స్మార్ట్ మీటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు .

# అంతా "దోపిడే" ఫైల్ కదలాలంటే పైసలే

- ఏసిబి అధికారులు దాడులు చేసిన మారనితీరు
- ఖమ్మంలోని రవాణాశాఖ కార్యాలయంలో అధికారుల తీరుపై విమర్శలు



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ప్రతి పనికి ఓ రేటు నిర్వహించి ఆయా పనులను తమకు నచ్చిన ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని దోపిడీ యదేచ్ఛగా కొనసాగు చేస్తున్నారనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారం అంతా ఖమ్మం ఆర్ టి ఓ కార్యాలయంలో జరుగుతుంది అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రతి పని చేయాలంటే చేయి తడపాల్సిందే అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ జీతం తీసుకుంటు చేయాల్సిన పనిని కూడా డబ్బుల ఇస్తేనే చేస్తామనే ధోరణి ప్రదర్శిస్తున్న తీరు పై సర్వత్రా విమర్శలు చోటు చేసుకున్నాయి. ఖమ్మం లో గల రవాణాశాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారులు తీరుపై విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. పరిపాలనా పరంగా పూర్తిస్థాయిలో అవగాహన ఉండటంతో కార్యాలయంలో ఆ శాఖ అధికారులు ఆడిందే ఆటగా, పాడింది పాటగా సాగుతుందని కార్యాలయ సిబ్బందే బహిరంగంగా చెప్పడం కొసమెరుపు. ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలిసే ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నాయినే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కార్యాలయంలో పనుల కోసం వచ్చేవారి నుంచి డబ్బులు వసూలు చేయడం కోసం ఏకంగా ఆ శాఖ అధికారులు ఒక్కో అధికారి ప్రైవేట్ వ్యక్తులనే నియమించుకోవడం పట్ల విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఖమ్మం రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో జరుగుతున్న వసూళ్ల దందా అధికారులకు తెలిసి జరుగుతుందా అంటే అవుననే సమాధానం వస్తోంది. ఖమ్మం రవాణా శాఖ కార్యాలయంలో వచ్చే ప్రతి ఫైల్ కు రేటును నిర్ణయం చేసి వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కార్యాలయంలో ఏవో గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ మృతి చెందడంతో ఈ పోస్ట్ కు అక్కడే విధులు నిర్వహిస్తున్న సినియర్ అసిస్టెంట్ కు ఇంచార్జీ ఏవో గా ఇచ్చారు. అదే అదునుగా భావించి కార్యాలయంలో అతను కలెక్షన్ కింగ్ అవతారమెత్తి ప్రతి ఫైల్ కు రేటు ఫిక్స్ చేశారు . ఆర్టీఏ కార్యాలయంలో ఏ ఫైల్ వచ్చిన అతనికి చెబితేనే ఫైల్ కదిలే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నారు. గతంలో ఇతను పనిచేసిన మహబూబాబాద్, కొత్తగూడెం లో కూడా వసూళ్ల చేయడంలో ఆరితేరినవాడు అని సిబ్బందే బహిరంగంగా చెబుతున్నారు. ఆర్టీఏ కార్యాలయంలో వచ్చే ప్రతి ఫైల్ కు రేటు నిర్ణయం చేసి వసూళ్లకు తెర లేపారు. కార్యాలయంలో వాహన రిజిస్ట్రేషన్, సెకండ్ వాహన రిజిస్ట్రేషన్, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల రిజిస్ట్రేషన్, ట్రాన్స్ పోర్ట్ వాహనాలపై రేటు నిర్ణయం చేసినట్లు సమాచారం. వివిధ సెక్షన్ నుంచి వచ్చే ప్రతి ఫైల్ అతనికి చెప్పి పెట్టాలి, చెప్పకుండా ఫైల్ పెడితే ఫైల్ పెండింగ్ లో పడుతుంది. ఫైల్ కు అది లేదు. ఇది లేదు అంటూ సవాలక్ష కొర్రీలు పెడుతూ ఫైల్ అంతే పెండింగ్లో పెడుతున్నారు. కార్యాలయంలో ఇతను చేస్తున్న వసూళ్ల పర్వం తో సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు.ఖమ్మం రవాణా శాఖ కార్యాలయంకు వచ్చే ప్రతి ఫైల్ పై వసూళ్లను ప్రైవేట్ ఎజెంట్ ద్వారా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ప్రతి రోజు వచ్చినా కలెక్షన్ సాయంత్రం ప్రైవేట్ ఎజెంట్ కలెక్షన్ కింగ్ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి రోజూ సుమారు రూ. 50 నుంచి లక్ష రూపాయల వరకు వసూళ్ల చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్టీఏ కార్యాలయంలో ఎసిబి సోదాలు జరిగినా మళ్లీ వసూళ్ల పర్వం సాగుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.ఆర్టీఏ కార్యాలయంలో కలెక్షన్ కింగ్ పై ఓ వాహనదారుడు చేయి చేసుకున్నట్టు తెలుస్తోంది. తన వాహనం పనిపై వారం రోజులుగా పని కాకపోవడంతో సహనం కోల్పోయిన అతను చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. ఇతను మహబూబాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సమయంలో అనేక ఆరోపణలు ఉన్నాయి. మహబూబాబాద్ నుంచి బదిలీ పై ఖమ్మం ఆర్టీఏ కార్యాలయం వచ్చిన కూడా అతని వసూళ్ల పర్వం కొనసాగుతోందని సిబ్బంది బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఈ కలెక్షన్ కింగ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కార్యాలయం కు వచ్చే వాహనదారులు కోరుతున్నారు. ఇటివల ఖమ్మం, వైరా కార్యాలయాలపై ఏసిబి అధికారులు దాడులు చేసిన వారి తీరులో ఎలాంటి మార్పు రాకపోవటం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

## వడదెబ్బ పై అప్రమత్తత అవసరం



పులిచెర్ల, మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత ప్రమాదకరంగా పెరిగి శరీర నియంత్రణ వ్యవస్థ దెబ్బతినే పరిస్థితిని వడదెబ్బఅంటారని, దీనివల్ల ప్రాణం పోయే పరిస్థితి ఎర్పడుతుందని కావున అప్రమత్తంగా ఉండాలని పులిచెర్ల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి సూచించారు. గడ్డంవారిపల్లె హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి, తలనొప్పి, తల తిరగడం, బలహీనత, అలసట, నోరు ఎండిపోవడం, వాంతులు లేదా వికారం, అయోమయం, మాట్లాడడంలో ఇబ్బంది దీని లక్షణాలని తెలిపారు.ప్రథమ చికిత్స లో భాగంగా వెంటనే బాధితుడిని చల్లని ప్రదేశానికి తరలించి గాలి వచ్చేలా చూడాలని, బిగుతైన బట్టలు సడలించి పడుకోబెట్టి శరీరంపై చల్లని తడి గుడ్డతో తుడవాలన్నారు. స్పృహ ఉన్నట్లయితే ఓ.ఆర్.యస్. ద్రావణం లేదా చల్లని నీరు తాగించాలన్నారు. పరిస్థితి తీవ్రమైతే 108 సహాయంతో వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా నివారించేందుకు ఎండ సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలని, పనులను ఉదయం లేదా సాయంత్రం చక్కపెట్టుకోవాలని, తగినంత నీరు, చల్లని పానీయాలు, ఓ.ఆర్.యస్ ద్రావణం తీసుకోవాలని తెలిపారు.వలుచని, లేత రంగు బట్టలు ధరించాలని, తలపై రుమాలు, టోపీ లేదా గుడ్డ కప్పుకోవాలని,పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. వేసవిలో మితంగా భోజనం చేయాలని, కూల్ డ్రింక్స్, మద్యం సేవించరాదని, ఈ సూచనలు పాటించడం ద్వారా వడదెబ్బను నివారించవచ్చునని మరియు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చునని తెలిపారు. సమావేశంలో పర్యవేక్షకులు పురుషోత్తం, మహిళా ఆరోగ్య కార్యకర్త జరీనా, ఆషాలు కృష్ణవేణి, మాధవి, జయమ్మ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన హనుమంతరావు



పులిచెర్ల, మార్చి 26(జర్నలిస్ట్ ఫైల్): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు తనిఖీ చేశారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్. ఫార్మసీ స్టోర్, ఓపి సేవలు, లేబర్ రూమ్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని ద్వారా అందించనున్న వైద్య సేవలు ఏర్పాట్లపై పరిశీలించారు. అధికారి వెంట వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, ఆయురారోగ్య వైద్యులు సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది ఉన్నారు.

## కోరుకొండ ఇనాం భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించిన ఎమ్మెల్యే

బత్తుల బలరామకృష్ణకు రైతులు, ప్రజల సత్కారాలు, అభినందనలు..!

ఆనందభాష్పాలు..!!

- ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే బాధిత రైతాంగం కోసం అహర్నిశలు శ్రమించిన ఎమ్మెల్యే బలరామకృష్ణ.
- తమ భూములను నిషేధిత జాబితా నుంచి మోక్షం కల్పించినందుకు హర్షం వ్యక్తం చేసిన బాధిత రైతాంగం.
- కోరుకొండ జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణని కలిసి ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపిన కోరుకొండ గ్రామస్తులు, అన్నదాతలు.



కోరుకొండ, మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న కోరుకొండ ఈనాం భూముల సమస్యకు తన పట్టు వదలని కృషితో పరిష్కారాన్ని సాధించిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకి బాధిత రైతాంగం కృతజ్ఞతలు తెలిపింది. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే కోరుకొండ ఇనాం భూములను నిషేధిత జాబితా అంటే 22 ( ఏ) నుంచి విముక్తి చేయించడానికి ఎమ్మెల్యే బలరామకృష్ణ అహర్నిశలు శ్రమించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని గత 20 నెలల కాలంలో పలుమార్లు కలిసి వినతి పత్రాలు అందించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి కోరుకొండ ఈనామ్ భూముల సమస్యను తీసుకువెళ్లి.. పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ మంత్రి సత్య కుమార్ని అనేకసార్లు కలిసి కోరుకొండ ఈనాం భూముల బాధిత రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రాలు అందించి ప్రత్యేకంగా భేటీ అయి.. వారిపై కూడా ఒత్తిడి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేసిన ప్రయత్నాలు ఫలించి.. ఎట్టకేలకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం కోరుకొండ ఈ నామ్ భూములను 22 (ఏ) నుంచి విడుదల చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడంతో.. కోరుకొండ రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. బుధవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణని ఎంతో ఆత్మీయంగా కలిసిన కోరుకొండ ఈనామ్ భూముల బాధిత రైతులు .. తమ కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణని పూలమాలలతో సత్కరించి.. తమ కృతజ్ఞతలు తెలియజేసి సంతోషాన్ని పంచుకున్నారు. కోరుకొండ గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, రైతు నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



# రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలి

### వ్యవసాయ శాఖ పని తీరు పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



మంథని/పెద్దపల్లి , మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : వ్యవసాయ శాఖ అధికారులు రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.... జిల్లాలో 79% ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేశామని, దీనిని 85% వరకు పూర్తి చేసే విధంగా ఎం.ఏ.ఓ, ఏ.ఈ.ఓ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి సంబంధించి రైతుల ఈ-కేవైసి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.రైతు బీమా పథకం అమలు పై వ్యవసాయ అధికారులు శ్రద్ధ పెట్టి రైతు మరణించిన తర్వాత త్వరగా సంబంధిత దరఖాస్తు ఫార్వార్డ్ చేస్తూ కుటుంబానికి సహాయం అందేలా చూడాలని అన్నారు. రాబోయే వానాకాలం సీజన్ కు అవసరమైన యూరియా పంపిణీ సజావుగా జరిగేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన బృందాలు గ్రామాలలో పర్యటిస్తూ రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు నూతన సాగు పద్ధతులు, భూ సారం పెంపుకు చర్యలు, పంట మార్పిడి విధానం పై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలలో పర్యటన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు తెలియజేయాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ తరపున సంపూర్ణ ఏర్పాట్లు పక్కాగా చేయాలని అన్నారు. రబీ సీజన్ సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రణాళిక ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకుని వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ



వనపర్తి జిల్లా చిన్నంబావి (జర్నలిస్ట్ ఫైల్) : చిన్నంబావి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలో రహదారిలో వాహనాలను స్థానిక మండల ఎస్ఐ రామన్ గౌడ్ బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలను తల్లి, దండ్రులు ఇవ్వవద్దని అన్నారు. చట్టాలు కఠిన తరంగా ఉన్నాయని అన్నారు. వాహనాలు తల్లి, దండ్రులు ఇస్తే వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. అనంతరం వాహనాలను తనిఖీలు చేశారు.

# నిరుద్యోగ యువత జాబ్ మేళా ను నియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



మంథని/పెద్దపల్లి, మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : నిరుద్యోగ యువత జాబ్ మేళా ద్వారా వచ్చే ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్ లో జరుగుతున్న జాబ్ మేళాను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.... నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అనేక చర్యలు చేపట్టిందని అన్నారు. టాస్క్ సెంటర్ ద్వారా అనేక నైపుణ్యం కోర్సులలో శిక్షణ అందిస్తూ వెంటనే మంచి ఎం.ఎన్.సి కంపెనీలలో ఉపాధి లభించేలా కూడా చర్యలు చేపట్టామని అన్నారు. టాస్క్ సెంటర్లో రిజిస్టర్ అయిన నిరుద్యోగులకు తప్పనిసరిగా ఉపాధి అందే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జాబ్ మేళా కార్యక్రమాలను టాస్క్ సెంటర్లో రెగ్యులర్ గా నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు వివిధ కంపెనీల ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇందులో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతో పాటు ఉపాధి కూడా కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జాబ్ మేళా వంటి కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట టాస్క్ సెంటర్ కౌసల్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పట్టణకేంద్రంలో డబుల్ రోడ్డు పనులను ప్రారంభం

### మున్సిపల్ చైర్ పర్సన్ బోదిరె నాగమణిస్వామి.



నిజామాబాద్ జిల్లా రూరూరల్ ప్రతినిధి భీంగల్ పట్టణం మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : భీమ్ గల్ పట్టణ కేంద్రంలోని వేల్పూర్ రోడ్డులో డబుల్ రోడ్డు మరియు సెంటర్ డివైడర్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ బొదిరె నాగమణిస్వామి మరియు ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం పనులను ప్రారంభించారు. ఆర్ అండ్ బి శాఖ నుండి 8 కోట్ల రూపాయలతో నిధులు మంజూరయ్యాని తెలిపారు. ఈ ఎనిమిది కోట్ల నిధులతో వేల్పూర్ రోడ్డులోని శివసాయి హాస్పిటల్ నుండి కమాన్ వరకు మరియు నంది గల్లీలోని పోచమ్మ గుడి నుండి బైపాస్ రోడ్డు వరకు మరియు బడ భీంగల్ రోడ్డులో సుభాష్ నగర్ చౌరస్తా నుండి బైపాస్ రోడ్డు వరకు కిలోమీటర్ మేర డబుల్ రోడ్డు నిర్మాణం మరియు సెంటర్ డివైడింగ్ నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యల సునీల్ కుమర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు జేజే నర్సయ్య, అనంతరావు, కన్నె సురేందర్, ఆరేపల్లి శ్రీజ నాగేంద్రబాబు, సందీప్, సురేష్, సంగ్యా నాయక్, దినేష్, శ్యామ్ రాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణలో
# పాల్గొన్న పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్



నారాయణఖేడ్ మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : ఖేడ్ నియోజకవర్గం నాగల్ గిద్ద మండలం కారసుగుత్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విగ్రహానికి పూలమాల వేసి సందర్భంగా ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సేవా సమితి కమిటీ సభ్యులను అభినందించారు.. ఈ కార్యక్రమంలో నాగల్ గిద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు: మాణిక్ రావు సర్పంచ్ నారాయణ జాదవ్, ఉపసర్పంచ్ అబ్రస్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్ పటేల్, సోపాన్ రావు పటేల్, బాలాజీ పటేల్, దత్తు రెడ్డి, నారాయణఖేడ్ నియోజికవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నందు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రూ. 1040.58 కోట్లతో గ్రేటర్ వరంగల్ బడ్జెట్ ఆమోదం

### మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బల్దియా కౌన్సిల్ కీలక నిర్ణయం




వరంగల్, ప్రతినిధి మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : వరంగల్ మహా నగర పాలక సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను బుధవారం జరిగిన పాలక వర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించింది. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొత్తం రూ. 1040 కోట్ల 58 లక్షల 75 వేల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది..బల్దియా అకౌంట్స్ అధికారి శివలింగం బడ్జెట్ అంచనాలను సభలో ప్రవేశపెట్టగా, మెజారిటీ సభ్యులు దీనికి మద్దతు తెలిపారు. ఈ బడ్జెట్‌లో ఆదాయ మార్గాలను ఈ క్రింది విధంగా అంచనా వేశారు.రూ. 349.19 కోట్లు,ప్రభుత్వ గ్రాంట్లు: రూ. 685.20 కోట్లు డిపాజిట్లు,అడ్వాన్సులు: రూ. 620 కోట్లు సాధారణ పన్నుల రూపంలో వస్తాయి. ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి ఇంచార్జి కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్, డెప్యుటీ మేయర్ రిజ్వాన శమీమ్ మసూద్, వివిధ విభాగాల అధికారులు మరియు కార్పొరేటర్లు పాల్గొన్నారు. నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఈ బడ్జెట్ అంచనాలను రూపొందించినట్లు మేయర్ పేర్కొన్నారు.



# ఇంద్రానగర్ దొడ్డిలో శ్రీ ఆంజనేయ దేవస్థానంలో విగ్రహప్రతిష్టాపన,ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజలు



రాజేంద్రనగర్, మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : హిందూ సంస్కృతి సాంప్రదాయాలను ఉట్టిపడే విధంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్తంభ ప్రతిష్టించుకోవడం జీవితంలో ఎంతో గొప్ప విషయం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ దొడ్డిలో శ్రీ ఆంజనేయ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాపన,ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడిందన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధార్మిక కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని,శాస్త్రోక్తంగా జరిగిన విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజా అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు బండి గోపాల్ యాదవ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..భక్తి మార్గం మనిషికి మానసిక ప్రశాంతతను ఇస్తుందని,ఇంద్రానగర్ దొడ్డిలో ఇంతటి అద్భుతమైన దేవాలయాన్ని నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. కాలనీ ప్రజలందరికీ ఆ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ సుష్మ మహేందర్ రెడ్డి,కోడిగంటి చంద్రారెడ్డి,గణేష్ గుప్తా,దూడల వెంకటేష్ గౌడ్,నీరటి రాజు ముదిరాజ్,ఆయిల్ కుమార్,పరేపల్లి శ్రీనివాస్ గౌడ్,అజయ్ కుమార్ జిట్టా సిద్దులు,నాగేష్ యాదవ్,స్థానిక మాజీ కౌన్సిలర్లు,ఆలయ కమిటీ ప్రతినిధులు,భక్తులు,కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పట్టణకేంద్రంలో అంబులెన్స్ డ్రైవర్లతో
# ప్రత్యేక సమావేశం ఏర్పాటు

### నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీమ్ గల్ పట్టణం



మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : భీమ్ గల్ పట్టణకేంద్రంలో బుధవారం ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో అంబులెన్స్ డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ ఇటీవల అంబులెన్స్‌లకు సంబంధించిన ప్రమాదలు పెరుగుతున్న నేపథ్యంలో, డ్రైవర్లు జాగ్రత్తగా వాహనలు నడపాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగం అవసరమైన ట్రాఫిక్ నియమలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండ జాగ్రత్తగా వాహనలు నడపాలని, ప్రజల ప్రాణ భద్రత ప్రతి డ్రైవర్ బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు అంబులెన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు

# మార్చి 28న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

### జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్

మంథని/పెద్దపల్లి, మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : మార్చి 28న శనివారం రోజున ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న గైనకాలజీ, ఆప్తామాలజిస్ట్, రేడియాలజీ, ఆర్థోపెడిషియన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (ఎంబిబిఎస్) పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు మార్చి 28న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నెలకు 52,351 రూపాయల వేతనం ఉంటుందని , ఇతర వివరాలకు 8499061999, 9492457809 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# లక్ష్మాపూర్‌లో శ్రీ సీతారాముల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శామీర్ పేట, (జర్నలిస్ట్ ఫైల్) : శ్రీరామనవమి పురస్కరించుకొని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లక్ష్మాపూర్ పరిధిలోని శ్రీ రాములగుట్ట దేవస్థానంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణం, వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటి రోజు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, మంగళ వాయిద్యాలు, వేద పారాయణం, నిత్యార్చన, శ్రీరామ కాశి విశ్వనాథ స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మహాగణపతి పూజ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య రక్షాబంధనం, ఋత్విగ్వరణ, ధ్వజారోహణ, గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, వేదిక ఆరాధన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, నామసంకీర్తన, తీర్థప్రసాద వినియోగం, భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ చిత్తయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, గ్రామ పెద్దలు చిన్నలచ్చ శ్రీనివాస్, బండి జగన్నాథం, క్యాతం మధుకృష్ణ, కటికెల గోపి, బండి రవీందర్, తోట పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బచ్చోడులో ఆధ్యాత్మిక వైభవం శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన

### - కన్నులపండువగా శివ-కేశవుల ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

### - ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి



తిరుమలాయపాలెం, (జర్నలిస్ట్ ఫైల్) : మండల పరిధిలోని బచ్చోడు గ్రామం బుధవారం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది. గత మూడు రోజులుగా అత్యంత నిష్ఠతో నిర్వహిస్తున్న శ్రీ సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల సహిత శ్రీరామ లింగేశ్వర, కనకదుర్గమ్మ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం నాటి ప్రధాన ఘట్టంతో వైభవంగా ముగిశాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈ ఆలయ సముదాయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కోసం సోమవారం నుంచే వేద పండితులు శాస్త్రోక్తంగా జలధివాసం, ధాన్యధివాసం వంటి క్రతువులను నిర్వహించారు.- సుముహూర్తాన ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాల్లో అత్యంత కీలకమైన చివరి రోజైన బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలో హోమగుండాల నుంచి వెలువడిన వేద మంత్రోచ్చారణలు మారుమోగాయి. ఉదయం 6:30 గంటలకు వాస్తు పూజ, పంచలోహ నవరత్న స్థాపన, జీవం పోయుట వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అనంతరం ఉదయం 9:50 గంటల సుముహూర్తాన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘట్టాలను కన్నులపండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య స్వామివార్ల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కావించడంతో భక్తుల జయజయధ్వానాలతో బచ్చోడు పులకించింది. ఈ కార్యక్రమంలో రామసహాయం నరేష్ రెడ్డి, రామసహాయం అరవింద్ రెడ్డి, హరిత రెడ్డి, బెల్లం శ్రీను, గంద్ర గోపాలరావు, కొప్పుల అశోక్, మంగీలాల్, ఉన్నం రాజశేఖర్, ఎన్.లింగయ్య, బి.సుదర్శన్, కరీం, వనవాసం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులు లంబాడి ఉద్యమం మరింత జోరు అరెస్టులతో ఆగని లంబాడి గళం



కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలన్న ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించవని లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు స్పష్టం చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరిన నేతలు, కార్యకర్తలను పోలీసులు ముందుగానే అదుపులోకి తీసుకోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను వినకుండా అరెస్టులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. లంబాడి సమాజ హక్కుల సాధన కోసం తమ పోరాటం ఆగదని, మరింత ఉత్సాహంతో కొనసాగుతుందని తెలిపారు. అరెస్టులు ఉద్యమాన్ని అడ్డుకోలేవని, ప్రజల మద్దతుతో తమ డిమాండ్ల సాధన వరకు నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.

## అంబులెన్స్ లేక మృతదేహాన్ని ఆటోలో
# తరలించిన కుటుంబ సభ్యులు



వరంగల్ ప్రతినిధి : మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : అంబులెన్స్ లేక మృతదేహాన్ని ఆటోలో తరలించిన కుటుంబ సభ్యులు బుధవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. చికిత్స పొందుతూ మృతి చెందిన పర్వతగిరి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన మహిళ మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆటోలోనే మృతదేహాన్ని తరలించాల్సి వచ్చింది. ఆస్పత్రుల వద్ద అంబులెన్స్‌లు అందుబాటులో ఉండడం లేదని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని పలువురు కోరుతున్నారు.

# యుద్ధ ప్రాతిపదికన త్రాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



మంథని/పెద్దపల్లి మార్చి 26 (జర్నలిస్ట్ ఫైల్) : త్రాగునీటి సరఫరా సజావుగా జరిగేందుకు జిల్లాలో చేపట్టిన పలు పనులను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో త్రాగునీటి సరఫరా పనుల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ..... త్రాగునీటి సరఫరా సంబంధించి అవసరమైన మరమ్మత్తులు, ఇతర పనులు చేసేందుకు 4 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్ సరఫరా, ఇంట్రా లో ఎక్కడా ఎటువంటి సమస్యలు రావద్దని అన్నారు.త్రాగు నీటి సరఫరా సంబంధించి చాలా గ్రామాలలో చిన్నచిన్న పనులు మంజూరు చేసి చాలా రోజులు జరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి రాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి కాలంలో చివరి ఇంటి వరకు త్రాగు నీరు సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. జిల్లాలో చేపట్టిన త్రాగునీటి పనులుయుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. త్రాగు నీరు పనుల కోసం అదనపు పైప్ లైన్ వేసిన తర్వాత గ్రామాలలో సిసి రోడ్ల మళ్ళీ వేయాలని అన్నారు. త్రాగు నీటి సరఫరా సంబంధించి చేసిన పనులకు ఎంబి రికార్డులలో నమోదు చేసి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని అన్నారు. త్రాగునీటి పనులకు సంబంధించి గ్రామాలలో ఎక్కడైనా తీర్మానం అవసరముంటే వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పంచాయతి అధికారిని ఆదేశించారు. జిల్లాలో త్రాగునీటి లీకేజీ ఎక్కడైనా ఉంటే వెంటనే సమస్య పరిష్కారం అయ్యే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓ.హెచ్.ఎస్.ఆర్ లను రెగ్యులర్ గా క్లీన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. త్రాగునీటి సరఫరాకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్స్ వివరాలను వెంటనే ప్రణాళిక అధికారితో సమయం చూసుకుంటూ సమర్పిస్తే నిధులు విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి త్రాగునీటి పనులు పూర్తి చేయాలని అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న హ్యాండ్ పంప్స్ మరమ్మత్తు పనులు చేపట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులలో 50% వరకు త్రాగునీటి సరఫరా కోసం ఖర్చు చేయవచ్చని, అందుబాటులో ఉన్న నిధులతో హ్యాండ్ పంప్స్, పంప్ సెట్,ఓ.హెచ్.ఎస్.ఆర్. మరమ్మత్తులు ఇతర పనులు 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో చేపట్టే త్రాగునీటి పనులలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ మనం చేసే పని ప్రజలకు తెలిసేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 2న జరిగే గ్రామసభ కార్యక్రమానికి మిషన్ భగీరథ నుంచి ఏఈ హాజరు కావాలని, త్రాగునీటి సరఫరా పై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఏప్రిల్ 15 లోపు తెలంగాణ పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బ్రహ్మయ్య, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిజిహెచ్ అభివృద్ధికి కృషి : కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్.డి.ఎస్) సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగింది. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు.

జిజిహెచ్ లో ఉన్న ఎస్.బి.ఐ శాఖను గల్లా జయదేవ్ బ్లాక్ లోకి మార్చుటకు కమిటీలు నిర్ణయించడం జరిగింది. అయితే ప్రతి ఏడాది కనీసం ఐదు కోట్లు రూపాయలు సి ఎస్ ఆర్ నిధులుగా సమకూర్చుటకు, నెలకు కనీసం లక్ష రూపాయలు అద్దెగా చెల్లించుటకు అంగీకరించాలని సూచించడం జరిగింది. తులసి రామచంద్ర ప్రభు బ్లాక్ ను 10 కోట్ల రూపాయలతో నాటుకో బ్లాక్ ను 9 కోట్ల రూపాయలతో పొదిలి ప్రసాద్ ఎక్స్టెన్షన్ బ్లాక్ ను 10 కోట్ల రూపాయలతో ఎల్లాప్రగడ సుబ్బారావు బ్లాగును 30 లక్షల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ వివరించారు. 1256 బెడ్ లు ఉండగా రోజుకు 14 వందలు వరకు బెడ్ లపై ఉంటున్నారని, వారిని సర్దుబాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మార్చ్యురిలో 12 శవాలాను భద్రపరిచే ఫ్రీజ్ త్వరలో రానుందని చెప్పారు.

నాట్ కో కేంద్రంలో ప్రతి రోజు 65 నుంచి 70 మంది రావడం జరుగుతుందని, వీటికి అవసరమైన సేవలు అందించుటకు సిబ్బంది అవసరమని నాట్ కో ఇన్ ఛార్జ్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఖాళీల వివరాలు, వాటి భర్తీ ప్రక్రియ వివరాలు అందించాలన్నారు. 13 ఆచార్యుల పోస్టులు, 22 సహ ఆచార్యుల పోస్టులు, ఆచార్యుల పోస్టులు, 34 సహాయ ఆచార్యుల పోస్టులు, 217 స్టాఫ్ నర్స్ పోస్టులు, 230 నాలుగవ తరగతి పోస్టులు ఖాళీలు ఉన్నట్లు నివేదికలు చూపుతున్నాయని వాటి భర్తీకి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాట్ కో కేంద్రంలో తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. హెచ్.డి.ఎస్ సభ్యులు తరచూ ఆసుపత్రిని సందర్శించి సంస్కరణలు తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో విధులు నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందుల కొరత ఉండరాదని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే వారికి బయటకు సిఫారసు చేయరాదని స్పష్టం చేశారు. వీల్ చైర్ లు, స్ట్రెచర్లు అవసరాలను గుర్తించి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఎలక్ట్రీషియన్ కొరత లేకుండా చూడాలని అన్నారు. మార్చ్యురి, డైట్ కిచెన్ త్వరగా మార్చాలని చెప్పారు. కమిటీ సభ్యులు తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ 36 లక్షల రూపాయలతో వాహనాన్ని సమకూర్చామని దానికి ఇప్పటి వరకు డ్రైవర్ ను ఏర్పాటు చేయలేదని తెలియజేయగా తక్షణ డ్రైవర్ ను ఏర్పాటు చేయుట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రాథమిక పరీక్షలు ఉచితంగా చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఆసుపత్రి ఆదాయ వ్యయాల వివరాలు, సి.ఎస్.ఆర్ నిధుల వివరాలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి. రంగా రావు, తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ వైండింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎవి. అప్పారావు ఆకస్మికమృతి



○ నివాళి అర్పించిన ప్రముఖులు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడిని నమ్ముకుని జీవితంలో అంచెలంచెలుగా ఎదిగినా, ఒదిగి ఉండే ఉన్నతులు, మోటార్ రీవైండింగ్ అసోసియేషన్ తెనాలి పట్టణ అద్యక్షులు అలపర్తి వెంకట అప్పారావు ఆకస్మిక మృతి అసోసియేషన్ సభ్యులను, కుటుంబ సభ్యులను కలిచివేసింది. మండలంలోని అంగళకుదురు గ్రామంలో నివశించె, అలపర్తి వెంకట అప్పరావు గురువారం తమ నివాసంలో తుదిశ్వాస విడిచారు. రైతుగా, శ్రామికుడుగా అందరితో కలుపుగోలుగా ఉండే అప్పారావు మోటార్ రీవైండింగ్ వర్క్ లో సిద్ధహస్తుడు. స్వయం ఉపాదితొ పాటు, సమాజంలో, ముఖ్యంగా తమ యూనియన్ కు, అద్యక్షులుగా సేవలందిస్తున్న వెంకట అప్పారావు, ఎనిమిది పదులు నిండిన అవిశ్రాంత శ్రామికుడు. వృత్తిపట్ల నిబద్దతగా ఉండే వెంకట అప్పారావు మృతి వార్త తెలియడంతొ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అప్పారావు బౌతిక కాయాన్ని సందర్శించి, పూలదండ సమర్పించి నివాళి అర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ జడ్పీసి అన్నాబత్తుని జయలక్ష్మి, పట్టణ టిడిపి అద్యక్షులు కుధ్దూస్, ఈదర వెంకట పూర్ణచంద్, మోటార్ రీవైండింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాజి, గ్రామ పెద్దలు, శ్రేయోభిలాషులు వెంకట అప్పారావు ఆకస్మిక మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## ఇ.వి.యం గోడౌన్లను తనిఖీ చేసిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు, ఫిరంగిపురంలలో గల ఇ.వి.యం గోడౌన్లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా గురువారం తనిఖీ చేశారు. గోడౌన్లలో ఈ.వీ.ఎంలు, వి వి ప్యాట్ లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను, గార్డ్ రూంల పరిస్థితి, సీసీటీవీలో పనితీరు, ఇన్వర్టర్ల స్థితి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరైన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 59.36 శాతం పూర్తి అయిందన్నారు. ఓటర్ల జాబితా పక్కాగా నవీకరణ చేయుటకు బూతు స్థాయి ఏజెంట్లను రాజకీయ పార్టీలు త్వరగా నియమించాలని అన్నారు. ఏజెంట్లు అనుసంధానంతో వాటర్ జాబితా నవీకరణ త్వరగా పక్కాగా చేపట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, లక్ష్మి కుమారి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, అమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా. టి సేవా కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వైవీ సుబ్బారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కే కే గుప్తా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి కంచరకర్ల శివరామయ్య, జనసేన పార్టీ ప్రతినిధి సీహెచ్ త్రినాధ్, తహసిల్దార్ లు పాల్గొన్నారు.

## 16 ఏళ్ల తర్వాత జనగణన




○ రెండు దశల్లో సర్వే
○ 33 కీలక అంశాలపై సమాచార సేకరణ
○ జిల్లా యంత్రాంగం సిద్ధం కావాలి
○ పల్నాడు జిల్లా.జాయింట్ కలెక్టర్ సంజన సింహ పిలుపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** 16 ఏళ్ల విరామం తర్వాత నిర్వహించబడనున్న 16వ జనాభా గణన ప్రక్రియను పకడ్బందీగా ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సింహ అధికారులను ఆదేశించారు. 2011చివరి జనాభా గణన జరిగింది, 2021లో జరగాల్సిన జనాభా గణన కోవిడ్ కారణంగా వాయిదా పడింది. ప్రస్తుతం ఈ భారీ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం రెండు దశల్లో జనగణన నిర్వహణకు సంసిద్ధత చేస్తోంది.

**జనగణన దశలు :** భారత ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశ హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ అంచనా ప్రకారం 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరగనుంది. రెండవ దశ పాపులేషన్ ఎన్యూమరేషన్ 2027 ఫిబ్రవరిలో నిర్వహించనుంది. దీనికి మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా నిర్ణయించారు. అయితే మంచు ప్రాంతాలైన లడాఖ్, జమ్మూ-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్లో రిఫరెన్స్ తేదీ అక్టోబర్ 1, 2026గా ఉంటుందని తెలుస్తుంది.

**శిక్షణా కార్యక్రమం పరిశీలన:** జనగణన ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన రెండవ దశ ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సంజన సింహ గురువారం సందర్శించి శిక్షణ తీరును సమీక్షించారు. మార్చి 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ శిక్షణలో జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ జనగణనలో కేవలం జనాభాను మాత్రమే కాకుండా గృహ నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, ఇంటర్నెట్ సహా 33 కీలక అంశాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుంది. ఇందులో గృహాల నిర్మాణ సామగ్రి (ఫ్లోర్, వాల్, రూఫ్), ఆస్తి యాజమాన్యం, తాగునీటి మూలం, లైటింగ్, శౌచాలయాలు, వంట వసతులు, ఇంటర్నెట్, మొబైల్/కంప్యూటర్ వంటి వసతులు, ప్రధాన ఆహార ధాన్యం వంటివి ఉన్నాయి. సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం ప్రతి అధికారి యొక్క చట్టపరమైన బాధ్యతగా ఉంది. 2011 తర్వాత 16 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ జనాభా గణన దేశంలోని ప్రతి గృహానికి ప్రతి వ్యక్తికి సంబంధించిన ఖచ్చితమైన డేటాను అందించి, ప్రభుత్వం రూపొందించే అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు (రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, తాగునీరు) రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈసారి డిజిటల్ మోడ్ లో ఎక్కువగా నిర్వహించనున్నారు.

## గుంటూరులో వీధి కుక్కలకు ఏబిసి ఏఆర్వి చేయాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ ఏబీసి (యాంటీ బర్త్ కంట్రోల్ సెంటర్)లో పూర్తి సామర్థ్యంతో వీధి కుక్కలలకు ఏబీసి, ఏఆర్వీ చేయాలని, అనంతరం నిర్దేశిత మార్గదర్శకాల మేరకు పర్యవేక్షణలో ఉంచాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఏబీసి ఏజన్సీ ప్రతినిధులకు స్పష్టం చేశారు. గురువారం పొన్నూరు రోడ్ లోని ఏబీసి సెంటర్, ఏటుకూరు రోడ్ లోని కంపోస్ట్ యార్డ్, పట్టాభిపురం మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఏబీసి సెంటర్ ని పరిశీలించి, ప్రస్తుతం రోజుకి ఎన్ని వీధి కుక్కలకు ఏబీసి చేస్తుంది, ఏబీసి అనంతరం వాటికి ఆహారం, సంరక్షణ వివరాలు అడిగి తెలుసుకొని, ఏజన్సీ ప్రతినిధులు, ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ ఏబీసి సెంటర్ పూర్తి స్థాయి సామర్ధ్యంతో పని చేసేలా సిబ్బందిని సిద్దం చేసుకోవాలని ఏజన్సీ ప్రతినిధులకు స్పష్టం చేశారు. అలాగే ఏబీసి అనంతరం తగిన ఆహారం ఇస్తూ సంరక్షించాలన్నారు. సెంటర్ పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు, రెండో క్యాబిన్ సిద్దం చేయడం, ఖాళీ స్థలాన్ని సిసి ఫ్లాట్ ఫారం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, సెంటర్ చుట్టూ పక్కల స్థలాన్ని సర్వే చేసి, జిఎంసి స్థలానికి బౌండరీలు ఫిక్స్ చేయలని డిప్యూటీ సిటి ప్లానర్ ని ఆదేశించారు. కంపోస్ట్ యార్డ్ ని పరిశీలించి మాట్లాడుతూ చెట్ల కొమ్మలను ముక్కలు చేసే ఉడ్ చిప్పర్, షెడ్డర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. మరో విండ్రో కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతంలో వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అనంతరం పట్టాభిపురం మెయిన్ రోడ్ జ్యూట్ మిల్ ఎదురు జిఎంసి షాపింగ్ కాంప్లెక్స్ ని పరిశీలించి, సంబందిత రెవెన్యూ అధికారి పూర్తి వివరాలతో రిపోర్ట్ ఇవ్వాలన్నారు. సదరు ప్రాంతంలోని ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలని ఏసిపిని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, డిసిపి సూరజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, విఏస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఈఈలు విష్ణు, కళ్యాణరావు, డిఈఈలు వెంకటరమణ, శ్రీనివాస్, సతీష్ కుమార్, ఏసిపి రెహ్మాన్, ఎస్ఎస్ లు రాజేష్, సోమశేఖర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణను ఉపేక్షింబోం



○ తహశీల్ధార్ కెవి. గోపాలకృష్ణ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిని ఉపేక్షించబోమని రికార్డుల ప్రకారం తిరిగి స్వాధీనం చేసుకోవడం తధ్యమని మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పెదరావూరు గ్రామంలోని గ్రామ రెవిన్యు కచేరి సావిడి స్థలాన్ని గత 20సంవత్సరాలుగా గ్రామంలోని ఓ వ్యక్తి స్వాధీనంలో ఉన్న విషయాన్ని గమనించిన మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ గురువారం రాత్రి తమ సిబ్బందితో పాటు, రూరల్ పోలీసుల సహకారంతో, ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా, ప్రభుత్వ స్వాధీనం చేశారు. ఈసందర్భంగా మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ మీడియాతొ మాట్లాడుతు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిని, ఉపేక్షించ బోమన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మండల పరిదిలో, మల్లెపాడు, నందివెలుగు గ్రామాల్లొ ప్రభుత్వ స్థలాల ఆక్రమణను అడ్డుకుని, స్థలాలు ప్రభుత్వ స్వాధీనంలోకి తెచ్చామన్నారు. పెదరావూరు గ్రామ కచేరి స్థలం 3సెంట్లు, 12నుండి15లక్షలు విలువ చేసే స్థలాన్ని గత 20ఏళ్ళుగా ఓ వ్యక్తి తన స్వాధీనం చేసుకున్నాడని, ఇది గమనించి, నోటీసులు ఇచ్చినా స్పందన లేక పోగా, ఆస్థలంలొ శాశ్వత నిర్మాణం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతొ, వెంటనే ఆస్థలాన్ని ఆవ్యక్తినుండి ప్రభుత్వ స్వాధీనం చేసుకునేలా, పోలీసుల సహకారంతొ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండల పరిదిలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కఠిన చర్యలుతీసుకుంటా మన్నారు. ఈకార్యక్రమంలొ రూరల్ ఎస్సై ఆనంద్, రెవిన్యు సిబ్బంది ఉన్నారు.

## తొలగించిన రూములపై విచారణ జరిపిన దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానం పరిధిలో టూరిజం శాఖ పరిధిలో ఉన్న మరుగుదొడ్లను తొలగింపు బ్రహ్మంగారి రథం పక్కనే ఉన్న షాపింగ్ రూములను దేవదాయ శాఖ అనుమతి లేకుండా నిర్మాణం చేయడం చేశారని ఫిర్యాదు చేయడంతో దానిపైన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్ విచారణ చేపట్టి జరిగిన వాస్తవాలను పై అధికారులకు నివేదికను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు జరిగిన సంఘటనలపై అధికారులకు నివేదికను పంపించడం జరుగుతుందని అదేవిధంగా బ్రహ్మంగారి రథం పక్కనే సాపింగ్ రూములను అధికారుల పర్మిషన్ లేకపోవడం, టూరిజం శాఖ అధికారుల పర్మిషన్ లేకుండానే అక్కడ నిర్మాణం చేసిన మరుగుదొడ్లను తొలగించడం కూడా జరిగిందని ఫిర్యాదులు వచ్చాయని అందులో భాగంగానే విచారణకు రావడం జరిగిందని షాపింగ్ రూముల నిర్మాణంపై షాపుల యాజమాన్యాన్ని పిలిపించివారి దగ్గర డాక్యుమెంటుపత్రాలను చూపించాలని షాపులు యాజమాన్యాలను అడగడంతో వారు ఎలాంటి స్పందించలేదని జరిగిన వాస్తవాలను అధికారులకు జరిగిన విషయాన్ని లెటర్ పూర్వకంగా పైఅధికారులకు నివేదికను అందించడం జరుగుతుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ తిరుపతి రెడ్డి, ఆలయ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల కళ్యాణానికి సర్వం సిద్ధం




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో రాముడికి ఎంత ప్రాధాన్యత ఉందో, శ్రీరామ నవమి ఉత్సవాలకు తెనాలిలో అంతే ప్రాధాన్యత ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. సుధీర్గ వత్సరాలుగా శ్రీరామ నవమి ఆద్యాత్మిక వేడుకలు తెనాలితో ముడిపడి ఉన్నాయి. శ్రీ సీతా రామ లక్మణ సమేత ఆంజనేయస్వామి పరివారంతొ, అంగరంగ వైభవంగా నిర్వహించుకునె శ్రీరామ నవమి కి, వసంత నవరత్రోత్సవాలుగా ప్రతీతి. శ్రీ పరాబవ నామ సంవత్సర చైత్ర మాస ఆరంభం నుండి, ప్రారంభమయ్యే వసంత నవరాత్రోత్సవాలలో, నవమి ఘడియలలో శ్రీసీతారామ కళ్యాణం కమనీయం, రమణీయం అన్నతీరుగా నిర్వహిస్తారు.

బోస్ రోడ్ లోని శ్రీ సీతారామ మందిరం, చిట్టి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలొ, అదేవిధంగా మార్కెట్ ఏరియా గాడిభావి సెంటర్ లోని, దొంగరాముడిగుడిగా పిలుచుకునే శ్రీ సీతా రామాలయం, మారీస్ పేట అప్పల స్వామి గుడి లొ, ఇలా ఊరంతా శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబవుతుంది. చలువ పందిళ్ళు సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. గాడిభావి సెంటర్ నుండి మెయిన్ రోడ్ పొడవునా, షరాబజార్, గోపాలరెడ్డి వీధి, ఉప్పుబజార్, మార్వాడీ గుడివీది, కూడళ్ళను కలుపుతు, చలువ పందిళ్ళు వేయడం ఆనవాయితీ. శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండీ అనే కళ్యాణ రాముడిని, సీతమ్మను వర్ణిస్తు మైకుల ద్వారా వచ్చే పాట భక్తులందరినీ అలరించే పాట, భక్తులందరు ఆలపించె పాట చలువ పందిళ్ళలో మార్మోగనుంది.

ముత్యాల తలంబ్రాలతొ భద్రాద్రి రాముడికి కళ్యాణం నిర్వహించిన తీరుగా తెనాలిలో శ్రీసీతారాముల కళ్యాణానికి భక్తులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. తిరునాళ్ళను తలపించే తీరుగా తెనాలి పట్టణంలోని ప్రధాన కూడళ్ళన్ని కళ్యాణ రాముడి కళ్యాణం తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చిట్టి అంజనేయ స్వామి గుడి సెంటర్ లోని, శ్రీ సీతా రామ మందిరంలో వసంత నవరాత్రోత్సవములలో భాగంగా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్య క్రమాలతో భక్తులను అలరిస్తున్న క్రమంలో, రాములవారి కళ్యాణానికి వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్ళకు వచ్చే, భక్తులను అలరించే విధంగా అంగళ్ళు వెలిశాయి. మురిపించే బొమ్మల అంగళ్ళు, ఆటవస్తువుల అంగళ్ళు, బోస్ రోడ్ లో, రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. రఘుకుల తిలకుని కల్యాణం హిందూ బంధువులందరీ ఆనందాన్ని పంచే శుభసమయం.

## ఏపీ గురుకుల పాఠశాలలు కాలేజీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల



○ చివరి తేదీ ఏప్రిల్ 7

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ గుంటూరు ఆధ్వర్యంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ నోటిఫికేషన్ విడుదలైనది. గుంటూరు జిల్లాలోని నందివెలుగు రోడ్డులో గల సుభాష్ నగర్ కాలనీలోని గల ఉర్దూ బాలుర గురుకుల పాఠశాల, సంగడిగుంట లో గల బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి అలాగే ఆరు ఏడు ఎనిమిది తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ఎం రజిని తెలిపారు. అలాగే ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ఉర్దూ బాలుర లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నందు ఎంపీసీ, బైపిసి మరియు సీఈ సెలలో అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించటమైనది అని జిల్లా కన్వీనర్ తెలిపారు.

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఏప్రిల్ 7 కాగా, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24న నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముస్లింలు క్రిస్టియన్లు సిక్కులు జైనులు , బౌద్ధ మైనారిటీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

పూర్తి వివరాల కొరకు పాఠశాల పని దినాలలో ఈ క్రింది 8712625038, 8712625039, 8712625073 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

## శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు వేగవంతం చేయాలి



○ అధికారులు సమన్వయంతో పని చేయాలి
○ నగర కమిషనర్ ఆదేశం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు పనుల వేగావంతానికి ప్రతి విభాగం సమన్వయంతో కృషిచేయాలని, నిర్మాణ సంస్థ తగిన సిబ్బందిని కేటాయించుకొని పనులను త్వరితగతిన చేపట్టాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రధానంగా ఇప్పటికే మార్కింగ్ ఇచ్చి, స్ట్రక్చర్ లు తొలగించి, నిర్దేశిత రుసుం చెల్లించిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు తొలగింపు చేపట్టాలని సిపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. ఆర్&బి, సిపిడిసిఎల్ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ డైవర్ట్ చేసే మార్గాలతో బ్యానర్ లను ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశిత వంతెన నిర్మాణ మార్గంలో ఎక్కడైనా మార్కింగ్ సమస్యలు ఉంటే జిఎంసి సిటి ప్లానర్ ని సంప్రదించాలన్నారు.

అన్ని శాఖల నుండి నిర్మాణ పనులకు పూర్తి సహకారం ఉన్నందున పనులను వేగంగా చేయలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు స్పష్టం చేశారు. అలాగే బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం రోడ్ ల్లో కూడా విద్యుత్ స్తంభాలను షిఫ్ట్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, సిపిడిసిఎల్ ఎస్ఈ రమేష్ బాబు, ట్రాఫిక్ డిఎస్పీ శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఏసిపి రెహ్మాన్, ఆర్&బి ఈఈ విశ్వనాధరెడ్డి, ట్రాఫిక్ సిఐలు సింగయ్య, అశోక్ కుమార్, ఆర్ఓబీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68


# రైతన్నల సంక్షేమమే లక్ష్యం - మంత్రి అచ్చెన్నాయుడు



- మరింత అంకితభావంతో పనిచేస్తా : మంత్రి అచ్చెన్న
- ప్రజాభివృద్ధే లక్ష్యంగా సుదీర్ఘ సేవ... అచ్చెన్నపై సీఎం ప్రశంసల వర్షం
- సచివాలయంలో సీఎం చంద్రబాబు , మంత్రి లోకేష్ సమక్షంలో మంత్రి అచ్చెన్న పుట్టినరోజు వేడుకలు
- సీఎం చంద్రబాబు ఆశీస్సులు నాకు మరింత బాధ్యతను పెంచాయన్న మంత్రి అచ్చెన్న

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో సీఎం ఛాంబర్‌లో మంత్రుల సమక్షంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా కేక్ కట్ చేయించి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువనేత, మంత్రి నారా లోకేష్ సమక్షంలో క్యాబినెట్ మంత్రులంతా కలిసి కేక్ కట్ చేసి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపిస్తూ ఆత్మీయ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అచ్చెన్నాయుడు చేసిన కృషిని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా ప్రజల అభ్యున్నతికై నిత్యం ఆలోచిస్తూ, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడి రాష్ట్ర పురోగతికి బాటలు వేసిన నాయకుడిగా ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలో తన జన్మదిన వేడుకలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తనపై ప్రత్యేక వాత్సల్యంతో స్వయంగా కేక్ కట్ చేయించి ఆశీర్వదించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన యువనేత నారా లోకేష్, మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి ఆత్మీయత, ఆశీస్సులు తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, రైతన్నల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## మార్కాపురం జిల్లాలో రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** మార్కాపురం జిల్లా, రాయవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్-ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సాయంపై ముఖ్యమంత్రి సమాచారం తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ నుంచి నెల్లూరుకు హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన మరో 20 మందిని తక్షణమే వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని జిల్లా పోలీసు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న సమాచారంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## మార్కాపురం రోడ్డు ప్రమాదంపై బీజేపీ అధ్యక్షుడు మాధవ్ దిగ్భ్రాంతి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న పలువురు సజీవదహనం కావడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు.

స్వస్థలాలకు చేరుకోవాల్సిన ప్రయాణీకులు ఇలాంటి దుర్ఘటనకు గురికావడం హృదయ విదారకమని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉండటం మరింత కలచివేసిందన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించాలని ప్రకాశం జిల్లా బీజేపీ నేతలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని, వారికి తగిన పరిహారం అందించాలని మాధవ్ డిమాండ్ చేశారు. ఈ విషాద ఘటన రాష్ట్రాన్ని తీవ్రంగా కలచివేసిందని ఆయన పేర్కొన్నారు.

## మార్కాపురం బస్సు ప్రమాద ఘటన పై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాంతి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో చోటుచేసుకున్న ఘటనపై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు సజీవ దహనం కావడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సంబంధిత అధికారులతో, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డితో ఫోన్ లో మాట్లాడి, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

# బి.ఆర్ ఇండోర్ స్టేడియంకు పూర్వ వైభవం తీసుకొస్తాం : పెమ్మసాని

- పాల్గొన్న పలువురు కూటమి నేతలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** బి.ఆర్ స్టేడియంకు పునర్వైభవం తీసుకురావడానికి కృషి చేయడం జరుగుతుందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. గుంటూరు పట్టణంలో గల బి.ఆర్ స్టేడియంలో ప్రాంగణంలో రూ. 14 కోట్లతో నిర్మించనున్న బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియంకు గురువారం కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి శంకుస్థాపన చేశారు. ఖేల్ ఇండియా క్రింద నిధులు మంజూరు చేయడం జరిగింది. రెండు అంతస్తులుగా నిర్మిస్తున్నారు. తొమ్మిది బాడ్మింటన్ కోర్టులతో, స్క్వాష్, టెన్నిస్ సహా ఆరు క్రీడా అంశాలలో వసతులు రానున్నాయి. 80 వేల చరుపు అడుగులు విస్తీర్ణం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్టేడియంలోని క్రికెట్ మైదానాన్ని వచ్చే ఏడాదిన్నర కాలంలో అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేస్తుందని చెప్పారు. రూ. 170 కోట్లతో డి.పి.ఆర్ లు తయారు చేయడం జరిగిందని వివరించారు.

అధ్యక్షత వహించిన శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దిన చరిత్ర బ్రహ్మానంద రెడ్డి స్టేడియంకు ఉందన్నారు. ప్రతి రోజు కొన్ని వేల మంది ఆరోగ్య పరిరక్షణకు దోహదం అవుతుందన్నారు. 26 ఎకరలుగా ఉన్న స్టేడియం ఆక్రమణలకు గురై 18 ఎకరాలుగా ప్రస్తుతం ఉందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా స్టేడియం నిర్మాణం జరుగుతుందని, భవిష్యత్తులో స్విమ్మింగ్ పూల్, సింథటిక్ ట్రాక్, డ్రైనేజ్ సిస్టమ్ తదితర సౌకర్యాలు రానున్నాయని చెప్పారు.

రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా బ్రహ్మానంద రెడ్డి స్టేడియం రూపురేఖలు మారుతున్నాయన్నారు. బి.ఆర్ స్టేడియం ఖ్యాతి గాంచిన స్టేడియం అన్నారు. అర్జున అవార్డులు సాధించుటకు సహకరించిన స్టేడియం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దిన స్టేడియం అని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా క్రీడలను ప్రోత్సహిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా క్రీడలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఉత్తమ క్రీడా విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఒలింపిక్ క్రీడలలో బంగారు పతకం సాధించిన వారికి రూ. 7 కోట్లు, రజత పతకం సాధించిన వారికి రూ. 5 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి రూ. 3 కోట్లను ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. జాతీయ క్రీడల్లో రాణిస్తే రూ. 10 లక్షలు ఇచ్చుటకు ప్రకటించారని చెప్పారు. క్రీడాకారులకు పతకం సాధించిన మేరకు హారిజాంటల్ రిజర్వేషన్ తీసుకురావడం జరిగిందన్నారు. 86 మందికి వ్యాయామ ఉపాధ్యాయులుగా నియమించామని చెప్పారు. క్రికెట్ క్రీడాకారిణి శ్రీ చరణ్ రెడ్డికి రూ. 2.50 కోట్లు నగదు, గ్రూప్ వన్ ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వడం జరిగిందన్నారు. 2023లో ఆసియా క్రీడల్లో పతకం సాధించిన ఎర్ర జ్యోతికి రూ. 30 లక్షలు, గ్రూప్ వన్ ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వడం జరిగిందన్నారు.

శాసన మండలి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు. లేట్ గా వచ్చినా లేటెస్టుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని పనిచేస్తున్నారని ప్రశంసించారు. సమాజంలో సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.

శాసన సభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ బి.ఆర్ స్టేడియం అభివృద్ధికి అంకురార్పణ పడటం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర సహాయ మంత్రి, స్థానిక శాసన సభ్యులు కృషిని అభినందించారు. పి.టి.ఉషా వంటి క్రీడాకారులు పాల్గొన్న స్టేడియం అన్నారు.

జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గుంటూరు యువత భవితకు పునాది పడిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించుటకు బీజం పడుతుందని ఆకాక్షించారు.

గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎన్.టి.ఆర్ స్టేడియం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏ.పీ.ఐ.ఐ.సి చైర్మన్ డేగల ప్రభాకర్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లేశ్వర రావు, జి.డి.సి.సి చైర్మన్ వాద్రాన హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ భీమనేని వందనా దేవి, రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ భరణి, తహసిల్దార్ సుభాని, కూటమి నాయకులు వెంకటేశ్వర రావు, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్ లు, డైరెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 18,19 తేదీల్లో పవిత్ర హజ్ యాత్రకు సన్నాహాలు

- హజ్-2026 యాత్ర సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహణ
- ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా హజ్ ఏర్పాట్లు ఉండాలి
- పవిత్ర హజ్ యాత్రికు రాష్ట్రం నుండి 2005 మంది
- విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 335 మంది
- మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : హజ్ యాత్రికులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్ తెలిపారు.

మైనారిటీ సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గురునానక్ కాలనీ లోని ఫ్రైడ్ మాధవ్ హోటల్ లో మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో హజ్ - 2026 యాత్ర సన్నద్ధతపై (కన్వర్జెన్స్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య కార్యదర్శి చిత్తూరి శ్రీధర్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా, హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్, అడిషనల్ డీసీపీ ఎస్వీఎమ్ మురళీ కృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్ మాట్లాడుతూ... 2026 సంవత్సరానికి రాష్ట్రం నుంచి 2005 మంది హజ్ యాత్రికులు ప్రయాణించనున్నారన్నారు. ఏప్రిల్ 18,19 తేదీల్లో నిర్వహించే పవిత్ర హజ్ యాత్రకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 335 మంది యాత్రికులతోపాటు, హైద్రాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 1134, బెంగళూరు నుండి 515, చెన్నై నుండి 14, ముంబై నుండి 05, ఢిల్లీ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 02 మంది హజ్ యాత్రకు వెళ్లనున్నారన్నారు. హజ్--2026 యాత్రకు సంబంధించి మొత్తం 335 మంది యాత్రికులు ఎంపికయ్యారు. అందులో 169 మంది పురుషులు, 166 మంది మహిళలు ఉన్నారన్నారు.

పవిత్ర హజ్--2026 యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర అధికారులందరూ సమిష్టి కృషితో పనిచేసి హజ్ యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పవిత్ర హజ్ యాత్ర, గౌరవప్రదమైన ప్రయాణాన్ని వారికి అందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న హజ్ యాత్రికుల సౌకర్యార్థం విజయవాడను ఎంబార్కేషన్ కేంద్ర ంగా (Embarkation Point) గుర్తించారన్నారు. యాత్ర ఏర్పాట్లలో సమన్వయం కోసం రాష్ట్ర హజ్ కమిటీ, జిల్లా యంత్రాంగం, విమానాశ్రయ అధికారులు, పోలీస్, వైద్య విభాగాలకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది క్యాంపును గన్నవరం ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్ఎమ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసే దిశగా పరిశీలిస్తున్నామన్నారు. ఈ వేదికలో ఏసీ సౌకర్యం, విశాలమైన పార్కింగ్, ప్రార్థనలకు అనువైన స్థలాలు అనువుగా ఉన్నట్లు గుర్తించామన్నారు.

యాత్రికుల కోసం సమగ్ర సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. క్యాంపులో సీటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా, క్యాంపు వద్దే హెల్త్ చెకప్‌లు, కౌన్సెలింగ్, వ్యాక్సినేషన్ సదుపాయాలు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. రవాణా విషయంలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, క్యాంపు నుండి విమానాశ్రయం వరకు యాత్రికులను తరలించేందుకు ఏసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు యాత్రికుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏర్పాట్లతో పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా మాట్లాడుతూ.. అమరావతి వేదికగా హజ్ యాత్రికుల కోసం ఒక మంచి కార్యక్రమాన్ని తలపెట్టినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, అలాగే సహకరించిన హజ్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఏప్రిల్ 18, 19 తేదీల్లో హజ్ యాత్రికులు విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరనున్నారన్నారు. సౌదీ ఎయిర్‌లైన్స్ కు చెందిన రెండు విమానాలు మొదటిసారిగా గన్నవరం విమానాశ్రయం నుండి నేరుగా ప్రయాణించనున్నాయన్నారు. గన్నవరం నుండి 335 మంది యాత్రికులు వెళ్తుండగా, మొత్తం ఆంధ్రప్రదేశ్ నుండి సుమారు 2,005 మంది మక్కా యాత్రకు వెళు న్నారన్నారు.

కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ లు ఈ యాత్ర విజయవంతం కావడానికి ఎంతో కృషి చేశారని, దీనిలో భాగంగా ఢిల్లీలో కేంద్ర మంత్రులతో మాట్లాడి విమాన సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు.

ఈ పవిత్ర హజ్ యాత్ర ను అందరూ సమన్వయంతో విజయవంతం చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చైర్మన్ షేక్ హసన్ భాషా కోరారు.

# బీఆర్ స్టేడియం క్రీడాకారుల కలలకు రెక్కలు ఇచ్చే దేవాలయం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- "17 కోట్లతో బీఆర్ స్టేడియం అభివృద్ధి - క్రీడలకు కొత్త ఊపిరి"
- "యువత క్రీడల్లో రాణించాలి -- ఆధునిక స్టేడియంలతో అవకాశాలు విస్తరణ"
- గుంటూరును అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి స్టేడియంల అభివృద్ధి ఎంతో కీలకమని, యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. గుంటూరును అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి కట్టుబడి, ఖేలో ఇండియా తరఫున మంజూరైన నిధులతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ స్టేడియంలో ఆధునిక మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన మల్టీ-స్పోర్ట్స్ సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...బీఆర్ స్టేడియం అభివృద్ధి అనేది గుంటూరు ప్రజల చిరకాల వాంఛగా ఉండగా, నేడు శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. స్టేడియం అంటే కేవలం మైదానం మాత్రమే కాదు, క్రీడాకారుల కలలకు రెక్కలు ఇచ్చే దేవాలయమని అభివర్ణించారు.

ఈ స్టేడియం పి.టి. ఉషా వంటి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ప్రతిభకు సాక్ష్యంగా నిలిచిందని, అనేక రంజీ ట్రోఫీ మ్యాచ్‌లకు వేదికగా నిలిచిన గొప్ప చరిత్ర ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తుచేశారు. ఇటీవలి కాలంలో స్టేడియం నిర్లక్ష్యానికి గురై, దుస్థితిలోకి చేరిందని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అనేకసార్లు రివ్యూ సమావేశాల్లో, అసెంబ్లీలో ప్రస్తావిస్తూ నిధుల కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో ఖేలో ఇండియా పథకం కింద రూ. 17 కోట్ల నిధులు మంజూరవడం గొప్ప విషయమని, దశలవారీగా స్టేడియాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ సంతోషకరమని తెలిపారు.

పెమ్మసాని చంద్రశేఖర్ ఎంపీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గుంటూరు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, గుంటూరు ఛానల్, ఆర్‌ఓబీలు, నందివెలుగు, వెంగళాయపాలెం ట్యాంక్ వంటి అనేక ప్రాజెక్టులకు నిధులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకునే నాయకుడిగా పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. బీఆర్ స్టేడియం అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజలు కూడా భాగస్వామ్యంగా తీసుకుని సంరక్షించుకోవాలని, అందరం కలిసికట్టుగా స్టేడియం వైభవాన్ని మరింత పెంచాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, రాష్ట్ర బడ్జెట్‌లో కూడా క్రీడల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు, యువత చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మర్యాద పురుషోత్తముడు... ఆదర్శ జీవన మార్గదర్శి శ్రీరాముడు

- సత్యం, ధర్మం, కర్తవ్యబద్ధతకు చిరస్థాయి ప్రతీక - శ్రీరామ నవమి సందేశం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ సంస్కృతిలో యుగయుగాలుగా నిలిచిన మహనీయులలో శ్రీరాముడు ప్రత్యేక స్థానం పొందాడు. "మర్యాద పురుషోత్తముడు"గా ప్రసిద్ధి చెందిన ఆయన, సత్యం, ధర్మం, కర్తవ్యబద్ధతకు పరమ ఆదర్శం. ఆయన జీవితం కేవలం పురాణ గాథగా మాత్రమే కాకుండా, ప్రతి మనిషి జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. శ్రీరామ నవమి సందర్భంగా ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన చూపిన విలువలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

అయోధ్య రాజు దశరథ మహారాజుకు జన్మించిన శ్రీరాముడు చిన్నప్పటి నుంచే శీలవంతుడు, వినయశీలి, ధైర్యవంతుడు. గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల భక్తి, సోదరులపై అపారమైన ప్రేమ -- ఇవన్నీ ఆయన వ్యక్తిత్వానికి మూలస్థంభాలు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ద్వారా ఆయన జీవితం ప్రపంచానికి పరిచయం అయింది. అందులోని ప్రతి ఘట్టం మానవ జీవన విలువలకు ప్రతీకగా నిలుస్తుంది.

శ్రీరాముడు తన జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. పితృవాక్య పరిపాలన కోసం రాజ్యాన్ని వదిలి అరణ్యవాసాన్ని స్వీకరించడం ఆయన ధర్మనిష్ఠకు గొప్ప ఉదాహరణ. రాజ్యాన్ని వదిలినా, ధర్మాన్ని మాత్రం ఎప్పుడూ వదల్లేదు. సీతాదేవి అపహరణ తర్వాత రావణాసురునిపై యుద్ధం చేసి, దుష్టశక్తులను నాశనం చేసి, ధర్మాన్ని స్థాపించాడు. ఈ యుద్ధం సత్యం, న్యాయం కోసం జరిగిన యుద్ధంగా చరిత్రలో నిలిచింది.

శ్రీరాముడు కేవలం యోధుడే కాదు; ఆదర్శ భర్తగా, ఆదర్శ కుమారుడిగా, ఆదర్శ స్నేహితుడిగా, ఆదర్శ రాజుగా ప్రతి పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించాడు. ఆయన పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించారు. అందుకే "రామ రాజ్యం" అనే పదం మంచి పాలనకు ప్రతీకగా నిలిచింది. ప్రజల సంక్షేమం, సమానత్వం, న్యాయం - ఇవన్నీ ఆయన పాలనలో స్పష్టంగా కనిపించాయి.

శ్రీరాముని జీవితంలో ముఖ్యమైన అంశం కర్తవ్యబద్ధత. పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా, ఆయన తన కర్తవ్యాన్ని ఎప్పుడూ విస్మరించలేదు. సత్యం కోసం, ధర్మం కోసం ఆయన చేసిన త్యాగాలు మనకు గొప్ప పాఠాలను నేర్పుతాయి. నేటి సమాజంలో కూడా ఈ విలువలు అత్యంత అవసరం. కుటుంబంలో, ఉద్యోగంలో, సామాజిక జీవితంలో ఈ గుణాలను పాటిస్తే సమాజం అభివృద్ధి చెందుతుంది.

రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదు; అది జీవన శాస్త్రం. అందులోని ప్రతి పాత్ర మనకు ఏదో ఒక పాఠాన్ని నేర్పుతుంది. లక్ష్మణుడు సోదరభక్తికి ప్రతీక అయితే, సీతాదేవి సహనానికి, పావిత్ర్యానికి ప్రతిరూపం. హనుమంతుడు భక్తి, సేవాభావానికి ప్రతీకగా నిలిచాడు. ఈ పాత్రలన్నీ కలిసి మనకు సంపూర్ణ జీవన విధానాన్ని చూపిస్తాయి. నేటి ఆధునిక సమాజంలో విలువలు కొంతమేర తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీరాముని జీవితం మనకు దారిదీపంగా ఉంటుంది. నిజాయితీ, నిబద్ధత, సహనం, క్షమ - ఇవన్నీ మనలో పెంపొందించుకోవాలి.

సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, న్యాయం నెలకొనాలంటే ఈ విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించాలి. శ్రీరామ నవమి పండుగ కేవలం ఆచారాలకు పరిమితం కాకుండా, ఆయన బోధించిన విలువలను మన జీవితాల్లో అమలు చేయడానికి ఒక సందర్భంగా భావించాలి. ఆలయాల్లో పూజలు, కల్యాణోత్సవాలు జరుపుకోవడం మాత్రమే కాకుండా, ఆయన చూపిన ధర్మ మార్గాన్ని అనుసరించడం ద్వారా నిజమైన భక్తిని చాటుకోవాలి. మన కుటుంబాలలో పిల్లలకు చిన్నప్పటి నుంచే రామాయణంలోని విలువలను పరిచయం చేయాలి. సత్యం చెప్పడం, పెద్దలను గౌరవించడం, ధర్మాన్ని పాటించడం వంటి అలవాట్లు పెంపొందించాలి. ఈ విధంగా మనం ఒక మంచి సమాజాన్ని నిర్మించ గలం. ఈ శ్రీరామ నవమి సందర్భం గా మనందరం శ్రీరాముని ఆశీస్సు లు కోరుకుంటూ, ఆయన చూపిన సత్య ధర్మ మార్గంలో నడ వాలని సంకల్పించుకుందాం. ఆయన ఆశీస్సులతో సమాజంలో శాంతి, సౌఖ్యం, సమృద్ధి నిండాలని ప్రార్థిద్దాం.



రచన:వై.వి. సుబ్బారావు, ఎంబీఏ, ఎంఏ (జర్నలిజం)

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467